# కార్యసాధనలో మహిళలు ఎవరికీ తీసిపోరు

## గీతం ఐఇఇఇ శాఖ ప్రారంభోత్సవంలో స్టీల్ ప్లాంట్ డిజిఎమ్ రమాదేవి

ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాలలోను ఎవరికి తీసిపోని విధంగా రాణిస్తున్నారని వారికి సరియైన అవకాశాలు ఇచ్చినట్లయితే సాంకేతిక రంగంలో సైతం తమ ప్రతిభను నిరూపించుకునే సత్తా కలిగి ఉన్నారని విశాఖ స్టీల్ ప్లాంట్ డిప్యూటి జనరల్ మేనేజర్ డాక్టర్ జి.రమాదేవి పేర్కొన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో నూతనంగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ (ఐఇఇఇ) విద్యార్థి విభాగాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే విద్యార్థినులు వృత్తి నైపుణ్యతను పెంచుకోవాలని దేశ ప్రగతిలో వారి పాత్రను పోషించే విధంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రగతిదాయకమైన ఆలోచనలనే కాక సాంకేతికంగా స్త్రీలు అన్ని విధాలుగా రాణించాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ గీతం విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్న వారిలో 40 శాతం మందికి పైగా విద్యార్థినులే ఉన్నారని, ప్రాంగణ నియామకాలలో సహితం అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు. నూతన ఆవిష్కరణలకు ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే వారు ప్రాధాన్యతను ఇవ్వాలని, వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని కోరారు.

కార్యక్రమంలో ఐఇఇఇ విశాఖ శాఖ ఛైర్మన్ డాక్టర్ అబ్రహం వర్గీస్, ఉమెన్ ఇన్ ఇంజనీరింగ్ (డబ్ల్యుఐఇ) విశాఖ శాఖ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.దీపికా రాణి, గీతం యూనివర్సిటి విభాగం కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ పి.వి.జయశ్రీ, కౌన్సిలర్ డాక్టర్ జి.కరుణాకర్, విద్యార్థి నాయకుడు కె.ఎమ్.క్రిష్టి, ఐఇఇఇ మాజీ అధ్యక్షులు డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**తేది: 22-07-2017,** | **ఎన్.వి.నరసింహం**
**విశాఖపట్నం.** | **పత్రికా సంబంధాల అధికారి**